ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

కలెక్టర్ లక్ష్మీశ ట్రెక్కింగ్

- బొమ్మల కళాకారుల వీధిమార్గంలో కొండపల్లి ఖిల్లాకు
- మ్యూజియాలు నాగరికతకు దర్పణాలని వ్యాఖ్య

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మ్యూజియాలు కేవలం జ్ఞాపకాల గదులు మాత్రమే కాదని, అవి మన నాగరికతకు దర్పణాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సంస్కృతి, చారిత్రక సంపద పరిరక్షణలో వీటి పాత్ర విశిష్టమైనదని, విభిన్న సంస్కృతులను తరతరాలకు పరిచయం చేసే విజ్ఞాన భాండాగారాలని అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.... ఆర్కియాలజీ, రెవెన్యూ, పర్యాటకం, పట్టణ పరిపాలన తదితర శాఖల అధికారులు, అడ్వెంచర్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో (మిగతా 2లో)



కొండపల్లి బొమ్మల కళాకారుల వీధి మార్గంలో ట్రెక్కింగ్ ద్వారా ఖిల్లాకు వెళుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు

మలి విడత సమీకరణపై అయోమయం

- అధికారిక ప్రకటన లేకుండానే గ్రామ సభలు
- నోటిఫికేషన్‌ను విడుదల చేయని ప్రభుత్వం
- రైతులను ఒప్పించేందుకు ప్రయత్నాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా మలివిడత భూ సమీకరణపై ఇంత వరకు అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేయలేదు. ఇందుకు సంబంధించి మంత్రి వర్గంలో కూడా ఆమోదం తెలపలేదు. కానీ గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రెండు మండలాల్లో భూ సమీకరణ పేరుతో గ్రామసభలు కొనసాగుతున్నాయి. తుళ్లూరు మండలంలో ఎంఎల్‌ఎ తెనాలి శ్రావణ్‌కుమార్, అమరావతి మండలంలో ఎంఎల్‌ఎ భాష్యం ప్రవీణ్ గ్రామ సభలు నిర్వహించి రైతులతో చర్చిస్తున్నారు. ఈ ప్రక్రియ గత 17 రోజులుగా కొనసాగుతోంది. అయితే ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేకుండా స్థానిక ఆర్‌డిఒ, తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి ఈసభలు నిర్వహిస్తున్నారు. రాజధాని విస్తరణలో భాగంగా మలివిడత 44 వేల ఎకరాలను భూమి సమీకరణలో తీసుకుంటారని మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగానే ఈ సభలు జరుగుతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ముందుగా ప్రజల నాడి తెలుసుకోండి.. (మిగతా 2లో)



నెమలికల్లు గ్రామసభకు హాజరైన రైతులు

రోడ్లపై నీరు నిలబడకుండా చర్యలు

- ప్రజాశక్తితో ఇన్చార్జి సిఎంఒహెచ్ డాక్టర్ గోపాల్ నాయక్





ప్రజాశక్తి - విజయవాడ : అకాల వర్షాలకు లోతట్టు ప్రాంతాలతోపాటు రోడ్లపై నీరు నిలబడకుండా మోటార్ల ద్వారా నీటిని తోడిస్తున్నామని, పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగర పాలక సంస్థ ఇన్చార్జి ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ ఎన్.గోపాల్‌నాయక్ తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పాదచారులకు, వాహనదారులకు, ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా వర్షం నీటిని డ్రైన్లలోకి మళ్లించడం, మోటార్ల ద్వారా తోడించి ట్యాంకర్ల ద్వారా బయటకు తరలించడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే డివిజన్ల వారీగా పారిశుధ్య నిర్వహణను మెరుగుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి సీజన్లో కాల్వల పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వర్షంనీటితోపాటు మురుగునీరు సాఫీగా ప్రవహించడానికి డ్రైన్లలో సమస్య ఉన్న చోట్ల దృష్టి కేంద్రీకరించి షిల్టు, చెత్తా చెదారం, ఇతర వ్యర్థాల తొలగింపు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో వర్షం నీరు మళ్లింపు, పారిశుధ్యం మెరుగుదల, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలపై డాక్టర్ గోపాల్‌నాయక్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లపై నీరు నిలిచిపోకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? పారిశుధ్యాన్ని ఎలా మెరుగుదల చేస్తున్నారు ?

రోడ్లపై వర్షం నీరు నిలబడకుండా ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తోడిస్తున్నాం. పారిశుధ్యానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు(మిగతా 2లో)



అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు ఉద్యమాలు

పిఎవికెసిటి కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నేడు 'దేశ సమాఖ్య వ్యవస్థ - ఎదురవుతున్న సవాళ్లు'పై స్మారకోపన్యాసం

- హాజరుకానున్న మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి - విజయవాడ : అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆడిటోరియంలో స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబివికె మేనేజ్‌మెంట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ 'భారతదేశ ఫెడరల్ వ్యవస్థ - ఎదురవుతున్న సవాళ్లు' అన్న అంశంపై స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంబివికె ట్రస్టు ఛైర్మన్ పి.మధు, ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.

నేడు తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

- వైసిపి సభ్యులకు గాలం?

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక సోమవారం జరుగనుంది. ఎంతో ఉత్కంఠ రేపుతున్న ఈ ఎన్నికకు ఆర్‌డిఒ మాధురి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో జరిగే ఈ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లకుగాను వైసిపికి 17 మంది, టిడిపికి ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. వైసిపికి చెందిన ఛైర్‌పర్సన్ కస్తూరిబాయి రాజీనామా చేయడంతో ఎన్నిక జరగనుంది. ఇప్పుడు జరిగే ఛైర్మన్ ఎన్నికకు వైసిపికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ రేసులో ఉన్నారు. టిడిపికి బలం లేకపోయినా వైసిపి(మిగతా 2లో)

25న 'దు:ఖం పండుతున్న నేల' కవితా సంపుటి ఆవిష్కరణ

విజవయాడ : మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్లో కంఠ బంగార్రాజు రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటిని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆవిష్కరిస్తారని మల్లెతీగ బాధ్యులు కె.కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళారత్న బిక్కి కష్ణ అధ్యక్షతన జరిగే సభలో ప్రత్యేక అతిథిగా సుప్రసిద్ధ సినీ గీత రచయిత రసరాజు, ఆత్మీయ అతిథులుగా కవయిత్రి, విమర్శకులు ఘంటశాల నిర్మల, ప్రముఖ కవి, కథకులు బి.ప్రసాదమూర్తి, ప్రముఖ కవులు జెల్ది విద్యాధరరావు, లోసారి సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు కావ్య విశ్లేషణ చేస్తారని, డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, డాక్టర్ ఎం.ప్రభాకర్, సరికొండ నరసింహరాజు, మందరపు హైమవతి, కోసూరి రవికుమార్, వొరప్రసాద్, అనిల్ డ్యాని, శిఖా ఆకాష్ తదితరులు ఆత్మీయ వచనాలు, బంగార్రాజు కంఠ కవి స్పందన తెలియజేస్తారని పేర్కొన్నారు.

రోడ్లపై నీరు నిలబడకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారోగ్య విభాగం క్షేత్ర స్థాయిలో పలు రకాల చర్యలు తీసుకుంటోంది. ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ అధికారులను కలుపుకొని కమిషనర్ నిత్యం ఉదయం సమయంలో నగరంలో పర్యటిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వాటికనుగుణంగా మేము ముందుకు సాగుతున్నాం. వీధుల వెంబడి చెత్త, ఇతర వ్యర్థాల తొలగింపు, డ్రైన్లు, వీధులను శుభ్రం చేసే అంశంలో కూడా ఎక్కడా రాజీపడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను పురమాయిస్తున్నాం.

ప్రశ్న : డ్రైన్లలో షిల్టు తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నగరంలోని అవుట్‌ఫాల్ డ్రైన్లు, మేజర్, మీడియం, మైనర్ డ్రైన్లలో పేరుకుపోయిన షిల్ట్ తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజారోగ్య విభాగం వారు మైనర్ డ్రైన్లలో, ఇంజినీరింగ్ విభాగం వారు కాంట్రాక్టు సిబ్బంది ద్వారా మేజర్, మీడియం, అవుట్ ఫాల్ డ్రైన్లలో షిల్టు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్నారు. నగరంలో మీడియం డ్రైన్లు 4,299 కిలో మీటర్లు, మైనర్ డ్రైన్లు 9,173 కిలోమీటర్ల మేర ఉన్నాయి. విఎంసికి చెందిన 90 మంది షిల్ట్ బ్యాచ్ వర్కర్లు నగరంలోని మూడు సర్కిళ్లలోని మైనర్ డ్రైన్లలో పేరుకుపోయిన షిల్ట్‌ను తొలగిస్తున్నారు. నగరవ్యాప్తంగా 174 పాయింట్లలో అవుట్‌ఫాల్ డ్రైన్లలో షిల్ట్ తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది.

ప్రశ్న : వీధుల్లో, రోడ్లపై పశువులు తిరగకుండా రోడ్డుపై నీరు నిలబడకుండా చర్యలు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నగరంలో ప్రధానంగా వీధులు, రోడ్లపైకి గేదెలు, ఆవులను వదిలేసి సంబంధిత యజమానులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇటువంటి వారిని గుర్తించి పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తున్నాము. బాధ్యతారహిత్యంగా పశువులను వదిలేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. వీధికుక్కలు, కోతులు, గేదెల బెడద నుంచి నగర ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

పశ్న : ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన స్వచ్ఛ సర్వేక్షన్ బృందాలు ఏఏ అంశాలను పరిశీలించింది?

కేంద్రం నుంచి వచ్చిన మూడు ప్రత్యేక బృందాలు 20 రోజులపాటు నగరంలో పర్యటించాయి. అన్ని రకాల కాంపోనెంట్లను పరిశీలించాయి. స్వచ్ఛ సర్వేక్షణ్, వాటర్ ప్లస్, టాయ్‌లెట్లు, గార్బేజ్ ఫ్రీ సిటీ (జిఎఫ్‌సి), డోర్ టు డోర్ బాస్కెట్ కలెక్షన్, బల్క్ వేస్ట్ జనరేటింగ్ ఇలా 39 కాంపోనెంట్లను బృందాలు పరిశీలించాయి. ఆయా డివిజన్లలో పర్యటించిన బృందాలు ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నాయి. క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, వివిధ అంశాలపై ప్రజంటేషన్ ఇలా వివిధ రూపాల్లో విషయ సేకరణ జరిపాయి.

మొదటిపేజీ తరువాయి

ట్రెక్కింగ్ ద్వారా కొండపల్లి ఖిల్లాకు చేరిన కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్ లక్ష్మీశ ట్రెక్కింగ్

కలిసి ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి కోటలోని మ్యూజియాన్ని సందర్శించారు. ముందుగా కొండపల్లి బొమ్మల కళాకారుల వీధి నుంచి ఖిల్లాకు ట్రెక్కింగ్ చేశారు. కొండపల్లి ఖిల్లా ప్రాంత గొప్ప వారసత్వ పరిరక్షణపై నిబద్ధతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సమాజాల్లో మ్యూజియాల భవిష్యత్తు అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా, చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ మ్యూజియాలు అభివద్ధి చెందుతున్న తీరుకు ఇది అద్దం పడుతుందని పేర్కొన్నారు. చారిత్రక ఔన్నత్యాన్ని వారి కళ్ల ముందుంచే సజీవ తరగతి గదులైన మ్యూజియాలను ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు సందర్శించాలని అన్నారు. విజయవాడలోని బాపూ మ్యూజియం, కొండపల్లికోటలోని మ్యూజియం వంటివాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేగంగా మారుతున్న మన ప్రపంచంలో మనం ఎక్కడి నుండి వచ్చామో అర్థం చేసుకోవడానికి ఇవి సహాయ పడతాయన్నారు. అదేవిధంగా మనం ఏ దిశగా వెళ్తున్నామనే దానిపై మార్గదర్శక జ్ఞానాన్ని అందిస్తాయన్నారు. వివిధ రాజవంశాల చారిత్రక ప్రయాణానికి చిహ్నాలుగా ఉన్న పురాతన కొండపల్లి కోటలో సాంప్రదాయ కొండపల్లి బొమ్మల నుండి అరుదైన కళాఖండాలు, శాసనాల వరకు ఉన్నాయన్నారు. కొండపల్లి ఖిల్లాను పర్యాటకంగా అభివద్ధి చేసేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు ప్రణాళిక ప్రకారం కషి చేస్తున్నామన్నారు. సమాజంలో మ్యూజియాల విశిష్టతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యా సంస్థలు, పౌర సమాజం, ప్రజలు ఇలాంటి వారసత్వ కార్యక్రమాలకు మద్దతిచ్చి, భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఎఫ్‌వో సతీష్, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్, విజయవాడ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఏపీ టూరిజం అథారిటీ కన్సల్టెంట్ సాహితి, టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మలి విడత సమీకరణపై అయోమయం

ఆతర్వాత ఉత్తర్వులు వస్తాయని చెప్పడం వల్లే ఈ సభలు జరుపుతున్నామని ఓ అధికారి వ్యాఖ్యానించారు. అయితే మున్సిపల్ మంత్రి పి.నారాయణ మాత్రం తమకు 10 వేల ఎకరాల భూమి అవసరమని ప్రకటించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి 4,500 ఎకరాలు, వ్యాపార కార్యకలాపాలకు 2,500 ఎకరాలు, రైల్వే లైను, ఇతర నిర్మాణాలకు మరో 3,500 ఎకరాలు అవసరమని పేర్కొన్నారు. కానీ మరో 44 వేల ఎకరాల సమీకరణపై మాత్రం ఇంత వరకు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. తాడికొండ మండలం రావెల వద్ద విమానాశ్రయం నిర్మిస్తారని ప్రచారం జరగడంతో సినీనటుడు బాలకృష్ణ కంపెనీ క్లాసిక్ ఇన్‌ఫో ప్రతినిధులతో సహా పలువురు తాడికొండ, మేడికొండూరు మండలాల్లో పెద్దఎత్తున భూములు కొనుగోలు చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం రావెల వద్ద భూమి అనువుగా లేదని పెదకాకాని మండలంలో ఏర్పాటు చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. దీంతో భూములు కొనుగోలు చేసిన పలువురు తాము నష్టపోతామనే ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన వైకుంఠపురం, పెదమద్దూరు, కర్లపూడి, యండ్రాయి తదితర గ్రామాల్లో గ్రామ సభలను పూర్తి చేశారు. తాజాగా అమరావతి మండలం అమరావతి, ధరణికోట, ఉంగుటూరు, నెమలికల్లు, మండేపూడి, నరుకుళ్లపాడు, లింగాపురం, ముత్తాయపాలెం, దిడుగు, పొందుగల, పెదకూరపాడు మండలం బలుసుపాడు, కంభం తదితర గ్రామాలను భూ సమీకరణకు ఎంపిక చేశారు. ఇటీవల పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నెమలికల్లు, ఉంగుటూరు, నరుకుళ్లపాడు, మండెపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నరుకుళ్లపాడులో కొంత మంది రైతులు భూ సమీకరణకు విముఖత చూపగా, మిగతా మూడు గ్రామాల్లో పలు విజ్ఞాపనలతో రైతులు సుముఖత వ్యక్తం చేశారు. తమకు కూడా 29 గ్రామాల పరిధిలోనే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని, కౌలు తక్షణం రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్లను తెరపైకి తెచ్చారు. అలాగే 2015లో నిర్వహించిన భూ సమీకరణలో మినహాయించిన వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలపై ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ దృష్టి సారించారు. వడ్డమానులో ప్రధాన రైల్వేస్టేషన్ ఏర్పాటవుతుందని చెబుతున్నారు. రైల్వే లైను కోసమే భూ సమీకరణ గ్రామసభ అని బ్యానర్ పెట్టి మరీ అభిప్రాయ సేకరణ జరిపారు. తాడికొండ ప్రాంతంలో ఇప్పటికే భారీగా ధరలు పెరిగి ఉండటంతో ఎక్కువ మంది రైతులు సమీకరణలో భూములు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తాడికొండలో పరిమితంగా సమీకరణ చేసి అమరావతి మండలం వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే రాజధాని అమరావతిలో పదేళ్ల క్రితం ఇచ్చిన భూములకే ఇంతవరకు రిటర్నబుల్ ప్లాట్లు తమ చేతికి అందలేదని, ఈదశలో మరో విడత సమీకరణలో భూములు ఇస్తే తమకు ప్లాట్లు ఎప్పటికి దక్కుతాయన్న ఆందోళనలో అమరావతి, తాడికొండ మండలాల రైతులు ఉన్నారు.

నేడు తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

కౌన్సిలర్లను ప్రలోభాలతో లొంగదీసుకునే ప్రయత్నాల్లో టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నలుగురు వైసిపి సభ్యులు ఇప్పటికే టిడిపి నేతల టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఎంఎల్ఎ ఓటుతో కలిపి టిడిపి బలం ఎనిమిదికి చేరుతుందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. మరోనలుగురు వైసిపి సభ్యుల కోసం ముమ్మరంగా బేరసారాలు సాగుతున్నాయని తెలిసింది. మరోవైపు వారం రోజుల నుండి వైసిపి నేతలు తమ కౌన్సిలర్లలో 9 మందిని క్యాంప్‌లో ఉంచింది. ఈ క్యాంప్‌లో ఒక మహిళా కౌన్సిలర్ భర్త టిడిపిలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద బలం లేకపోయినా అధికార, ధన బలంతోనైనా నగర పంచాయతీని కైవసం చేసుకోవాలని టిడిపికి చెందిన నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధి చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం అవుతాయా లేదా బెడిసి కొడతాయా అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

సుజనాకు పరామర్శ

ప్రకాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి)ని ఆదివారం రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన సుజనా కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగింది. హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన వద్దకు జకియా ఖానం తమ కుటుంబ సభ్యులతో వెళ్లి పరామర్శించారు. ఎంఎల్ఎ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

21న డిఇఒ ఆఫీస్ ముట్టడిని విజయవంతం చేయాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి చేసిన చట్టంలోని అసంబద్ధతను, పాఠశాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన నిబంధనలను సవరించాలని కోరుతూ ఈనెల 21న మచిలీపట్నం డిఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం మచిలీపట్నం లోని యు టి ఎఫ్ కృష్ణా జిల్లా కార్యాలయం లో ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి కృష్ణా జిల్లా ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు డి .లంకేష్, షౌకత్ హుస్సేన్ ఉమ్మడి అధ్యక్షతన సమావేశమైన ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ ఆ మేరకు తీర్మానం చేసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయమని రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ, ప్రభుత్వం 117 జీవో రద్దు పేరుతో గతంలో ఆరుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిందని,ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు.పాఠశాల స్థాయిలో ఉన్న భౌతిక, సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలలను పునర్వ్యవస్థీకరించడం జరిగిందని,దీనిద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా వచ్చాయని వారు పేర్కొన్నారు.దాంతో పాటు మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ స్కూల్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతో పాటు, చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలకు చేరుకోవడం కష్టమవుతుందని, దీనిని సవరించాలని డిమాండ్ చేశారు.యు టీ ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య మాట్లాడుతూ బదిలీ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల యొక్క ప్రతిపాదనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉందని దుయ్యబట్టారు.ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల కేటాయింపుకు సంబంధించి విభిన్న పద్ధతులు అవలంబించారని, వాటిని సరిదిద్దాలని, మోడల్ పాఠశాలలకు ఇస్తామంటున్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎస్జీటీ నుండి పదోన్నతులు కల్పించి ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షౌకత్ హుస్సేన్, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఇమ్మాన్యుయేల్, ఏపిటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, ఐక్యవేదిక నాయకులు బి.లంకేష్, జే.లెనిన్ బాబు, రాధిక , పి.శ్రీనివాస్‌రావు, మహంకాళేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, సధారతుల్లా, అబ్బాస్, బి.రఘునాథ్, నున్నా రాంబాబు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తాతినేని సంబరాలు

ప్రజాశక్తి-మొవ్వ: మండల కేంద్రమైన మొవ్వలో రెండు రోజులుగా జరుగుతున్న తాతినేని వంశీయుల సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సంబరాలకు రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన తాతినేని వారి కుటుంబాలే కాకుండా ఆడపడుచులు సైతం గ్రామానికి తరలివచ్చి సంబరాల్లో పాలుపంచుకొన్నారు. ఈ సందర్భంగా దేవాలయం నుంచి పుట్టింటికి వచ్చిన అమ్మవారి (ఘటం)ని పోతురాజు గడ తో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం మొక్కుబడులు తీర్చుకొని అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయాలకతీతంగా అందరూ ఒక చోట చేరి సంబరాన్ని నిర్వహించుకున్నారు.

మాదిగలకు తోడుగా ఉంటాం : రాజా

ప్రజాశక్తి-గన్నవరం: ఎప్పుడైనా అన్ని వేళలా మాదిగలకు తాము తోడుగా ఉంటామని మాదిగలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లూరి రాజా అన్నారు. ఎంఆర్పీఎస్ నాయకులు వల్లూరి నాని ఆహ్వానంతో ఓ ప్రైవేటు కార్యక్రమంలో రాజా పాల్గొన్నారు. స్థానిక నాయకులు రాజాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకులు రాజాను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎల్లప్పుడూ తాము మాదిగలకు అండగా నిలబడతామని, మాదిగలకు అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా తాము కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాము, ఎం. రాయణరావు, కొప్పుల బాబీ, గంపల సంపూర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో డ్రైనేజీలు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-గన్నవరం: ఎక్కడ చూసినా మురుగునీరు... లీకవుతున్న వాటర్ పైపులు.. డ్రైనేజీలు లేవు.. పట్టించుకునే అధికారులు లేరు.. ఇది గన్నవరం మండలం అల్లాపురం దళితవాడ బీసీ కాలనీలో పరిస్థితి. ఈ అల్లాపురానికి ఏమైంది., అధికారులు, నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదు.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేదల నివసించే ప్రాంతంలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, నిధులు లేకపోవడంతో పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో మురుగునీ రాగిపోవడంతో దోమలకు నిలయముగా మారింది. పైపుల్లో నుంచి నీరు లీక్ అవుతుంది. డ్రైనేజీ పనులు సగంలోని ఆగిపోయాయి. ఈ సమస్యలన్నీ ఇప్పుడు పరిష్కారం అవుతాయో తెలియడం లేదని జనాలు చెప్పున్నారు.అనాది కాలం నుండి అల్లాపురం గ్రామంలోని దళితులు అంటే ఎందుకు అంత చిన్న చూపో అర్థం కావడం లేదు.డ్రైనేజీ కొద్దిగా తీసి ఎందుకు వదిలేశారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి పై వేటుపడింది. దీంతో ఆ పోస్ట్ ఖాళీ అయింది. ఇన్చార్జిని నియమించిన పనులు పూర్తిగా జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దళితవాడలో డ్రైనేజీ రోడ్డుకు ఇరు ప్రక్కల కాకుండా., ఒక ప్రక్కన మాత్రమే తీయడానికి



గల కారణం ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ఒకవైపు అయితే మరోవైపు ఇంటికొక స్పీడ్ బ్రేకర్., మండల పరిషత్ స్కూల్ రోడ్డు దగ్గర కొండల్లాగా వేసిన స్పీడ్ బ్రేకర్లు., ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని సమస్యలు మండల స్థాయి అధికారులకు, నాయకులకు ఎందుకు పట్టవని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని ప్రజలు మనుషులు కారా, ఆ డ్రైనేజీ వ్యవస్థ ఆ విధంగా ఉంటే జబ్బులు రావా.. లేదా... దళితులంటే చిన్నచూపా? అని ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

21న అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-పామర్రు: స్థానిక సోమేశ్వర స్వామి ఆలయం(శివాలయం) పక్కన తాడిశెట్టి పూర్ణయ్య,ఎ -గేశ్వరరావు (పాము)వంశీయుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభమవుతాయని కార్యక్రమ నిర్వాహకులు తాడిశెట్టి సాంబశివరావు ఆదివారం తెలిపారు. 23న భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొంటారని తెలిపారు.

ఈడే నాని కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు మండల టిడిపి కార్యదర్శి ఈడే నాని కుటుంబాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరామర్శించారు. నాని తండ్రి ఈడే వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడు నాని అని వారి కుటుంబంలో పెద్దను కోల్పోవడం తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, నాయకులు ఈడే గంటయ్య, చాట్ల పెద్ద రమేష్, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

21, 23 తేదీల్లో మినీ మహానాడు : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గ్రామస్థాయి శ్రీమానాలే లక్ష్యంగా ఈ నెల 21న మచిలీపట్నం నియోజకవర్గం, 23న కృష్ణాజిల్లా మినీ మహానాడును నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిత్యం తపించే ఏకైక పార్టీ టిడిపి మాత్రమేనన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం, ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. గ్రామ స్థాయి నుండి సమస్యలపై చర్చించి ఆ మేరకు రాష్ట్ర స్థాయి మహానాడులో



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

తీర్మానాలు చేస్తామన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో ఎక్కడా లేని విధంగా సంస్థాగతంగా నాయకత్వాన్ని ఎన్నుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల నుండి మంత్రులు ఎమ్మెల్యేల వరకు అత్యధిక మంది తెలుగుదేశం పార్టీ అనే ఫ్యాక్టరీ నుండి వచ్చిన వారే అన్నారు. కోటి మంది సభ్యత్వంతో దేశ చరిత్రలో తెలుగుదేశం రికార్డులు సష్టించిందన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులు ప్రారంభించామని, ప్రజలకు మేలు చేయడం సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎంవి.బాబా ప్రసాద్, మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె నాని, మాజీ జెడ్పీటీసీ లంకె.నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు

వానొస్తే చెరువే..!

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: కొద్దిపాటి వర్షానికి బందరు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి ప్రధాన రహదారి నీళ్లతో నిండిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు తరలించే వ్యవస్థ పూర్తిగా స్తంభించడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చల్లపల్లి రోడ్డులో పతుల్బాద్ వంతెన వద్ద ప్రతిరోజు ఉదయం వర్షం కురవకపోయినా డ్రైనేజీ పొంగి మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మంత్రి కూటమి నాయకులు ప్రకటిస్తున్న బంగారు బందరు సంగతి ఏమోగానీ కొద్దిపాటి వర్షాలకే మునిగిపోతున్న మురుగు బందర్ నుంచి విముక్తి కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

మంత్రిని కలిసిన బండి రామకృష్ణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ ఆదివారం మంత్రి నివాసంలోమర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్‌గా రైతులకు సేవ చేసే చక్కటి అవకాశాన్ని కూటమి ప్రభుత్వం బండి రామకృష్ణకు కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, మరకాని వాసు, గడ్డంరాజు, గణేష్ పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం నగర కార్పొరేషన్ 44వ డివిజన్ రుస్తుంబాద మెయిన్ పార్క్ బాలికోన్నత పాఠశాలలో శంకర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ టెక్నీషియన్ ఎస్.సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరాన్ని టిడిపి డివిజన్ ఇంచార్జ్ మంచాల రాంబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా అన్ని వయసుల వారికి నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు ఫణికుమార్, తలారి రాంబాబు, నల్లారి మురళీకృష్ణ, అయినాల లక్ష్మణరావు, చలమల శెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న శ్రీనివాస్

కాంట్రాక్టర్ల బారి నుండి వర్కర్లను కాపాడండి

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలో ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ వర్కర్స్ హక్కులను కాలరాస్తున్న కాంట్రాక్టు వ్యవస్థ బారి నుండి కార్మికులను కాపాడాలని రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్ రాష్ట్రస్థాయి సమావేశంలో డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రావలసిన ఇఎస్‌ఐ, పిఎఫ్, సరైన జీతాలు గాని కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదని స్కీం కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం నియమించిన రేట్ల ప్రకారం కార్మికులకు జీతభత్యాలు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకొని, తదనంతరం కార్మికులకు అరకొరగా జీతాలు చెల్లించడంతో, నేటికీ ఆ కుటుంబాలు కునారిల్లుతున్నాయని అన్నారు. దీనికి కారణం కాంట్రాక్టర్ వ్యవస్థేనని, ప్రభుత్వం చర్య తీసుకుని కాంట్రాక్టు వ్యవస్థలో ఉన్న లోపాన్ని సరిదిద్ది కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ బాబు, యూనియన్ గౌరవ అధ్యక్షులు వినుకొండ రాజారావు, చీఫ్ అడ్వైజర్ మేళం భాగ్యారావు, న్యాయ సలహాదారులు సాతులూరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట గ్రంథాలయంలో విద్యార్థులు

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ఆదివారం పట్టణంలో గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో మొదటిగా పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులచే తెలుగు హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ చేయించారు. యోగ ఉపాధ్యాయులు వ్యక్తి వికాసము అనే అంశంపై అవగా హన కలిగించి మెడి టేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ సిబ్బంది జె శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు విజయవంతంగా జరుగుతున్నాయని గ్రంథాలయ అధికారి కె.పద్మ తెలిపారు. అదివారం విద్యార్థులతో పుస్తకాలు చదివించటం, మెదడు చురుగ్గా పని చేయడానికి విద్యార్థులకు చెప్పుకోండి చూద్దాం తది తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె చెప్పారు. అనంతరం శనివారం నిర్వహించిన దేశభక్తి గీతాలు పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ఆమె తెలిపారు.



తిరువూరు గ్రంథాలయంలో పుస్తకం చదువుతున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు

'స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో'

ప్రజాశక్తి - విజయవాడ : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టాఫ్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు నిర్వహించారు. రాత్రి సమయాలలో రోడ్డు ప్రమాదాలను నివారించాలన్న ముఖ్య ఉద్దేశంతో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి శని, ఆదివారం రాత్రి/ తెల్లవారుజాము సమయంలో మాచవరం మహానాడు రోడ్డులో, సత్యనారాయణ పురం శారదా కళాశాల సమీపంలో, భవానీపురం గొల్లపూడి హైవే సమీపంలో, తిరువూరు హైవే సమీపంలో, జి.కొండూరు హైవే సమీపంలలో స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి సమయాల్లో ప్రధాన రహదారుల గుండా ప్రయాణించు వాహన డ్రైవర్లు నిద్రలేకుండా ఎక్కువ దూరాలకు ప్రయాణించడం వల్ల తెల్లవారు జామున 2 గంటల నుండి 5 గంటల ప్రాంతాల్లో నిద్రలోకి జారుకోవడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వారన్నారు. ఈ నేపథ్యంలో స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమం వలన చాలా వరకు రాత్రి సమయాలలో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని పోలీసు అధికారులు తెలిపారు.



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బొండా ఉమా

ప్రజాశక్తి - విజయవాడ : బందర్ రోడ్డులోని విజయ్ కృష్ణ సూపర్ బజార్ నూతన పాలకమండలితో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సూపర్ బజార్ పైన ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో బొండా ఉమా మాట్లాడుతూ నాణ్యమైన సరుకులు, సరసమైన ధరలకు విజయ్‌కృష్ణ సూపర్ బజార్‌లో అందుబాటులో ఉండేలా కార్యకర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా అవసరాలు తీర్చే నాణ్యతతో కూడిన అన్ని రకాల సరుకులు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దీపావళి పండుగ సమయంలో టపాసులు నాణ్యతతో కూడిన సరసమైన ధరలకు అందించడం విజయ్ కృష్ణ సూపర్ బజార్ ప్రత్యేకత అని అన్నారు. నూతనంగా ఎన్నికైన ఈ పాలక మండలికి పుష్పగుచ్చాలు శాలువాలతో అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. తూర్పు ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ సంస్థలో ఉన్నటువంటి లోపాలను సరిదిద్దుకొని ఈ సూపర్ బజార్ గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీతో సూపర్ బజార్ ఎండి కిరణ్ కుమార్, ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయించారు. సూపర్ బజార్ చైర్మన్‌గా వెలగా సురేష్ బాబు, పాలకమండలి సభ్యులుగా మోతుకూరి కాసిం, పడమటి రామకష్ణ, దొంగర ఆంజనేయులు, బేవర సూరి, కడియం శివప్రకాష్, వేల్పుల రాజేష్ ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, టిడిపి యువ నాయకులు, ప్రముఖ న్యాయవాది బొండా రవితేజ, కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహన్‌రావు, మోదుగుల తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొలతలు, ప్యాకేజీలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విజయవాడ : వస్తువులను కొనే సమయంలో ప్రజలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని, కొలతలు, ప్యాకేజీలు పరిశీలించాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ (గుడివాడ) టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. గంగూరులోని లారీ ఓనర్స్ బంకులో ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆప్‌రేటివ్ స్టోర్స్ లిమిటెడ్ కొలతల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన లీగల్ మెట్రాలజీ అవగాహన సదస్సులో అయన పాల్గొన్నారు. గ్యాస్, బంగారం వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలను ఇండియన్ అయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ ఎఎస్ఆర్ శేఖర్ తెలిపారు. మే 20న ప్రపంచ కొలతల (మెట్రాలజీ) దినోత్సవం ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఒసి రిటైల్ సేల్స్ మేనేజర్ సంతోష్ విజయ్, లారీ ఓనర్స్ కోఆప్‌రేటివ్ స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు జగదీశ్వరరావు, పివిఎస్‌ఆర్ ప్రసాద్, ఎపిఎస్‌పిడి సంఘం సంయుక్త కార్యదర్శి వై హేమప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్

శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - తిరువూరు : దాహం తీర్చుకోవడానికి మార్కెట్‌లో సులభంగా లభించే శీతల పానీయాలని సేవిస్తే అనారోగ్యం పాలయ్యే అవకాశాలున్నాయని, వాటికి బదులుగా నిమ్మరసం, మజ్జిగ వంటి సహజ పానీయాలు తీసుకోవడం మంచిదని జనవిజ్ఞాన వేదిక (జెవివి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ సూచించారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శీతల పానీయాలు-నష్టాలు అనే అంశంపై జనవిజ్ఞానవేదిక రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ నాయకులు ఎం.రాం ప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్, బి.సైదులు, ఎస్.జగన్మోహన్ రావు, పి.శోభన్ బాబు, సురేంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నందిగామ అయ్యప్ప స్వామి దేవస్థానం ఏరియా లో ఒక అపార్ట్ మెంట్ నుండి వచ్చిన ఆహారం డివిఆర్ కాలనీ 7 వ రోడ్డులో యానాదుల కాలనీలో నివసిస్తున్న 200 మంది పేదలకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ సేవాసమితి చైర్మన్ పారేపల్లి సాయిబాబు, సభ్యులు పబ్బతి జనార్ధనరావు, ఈదా వెంకట్ రెడ్డి, యాటగిరి ఏడుకొండలు, తుపాకుల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు బస్సులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పవిత్ర హజ్ యాత్రకు హాజీలు మక్కా బయలు దేరుతున్న సందర్భంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం, పంజా సెంటర్, ముసాఫిర్ ఖానాలో సమావేశం ఏర్పాటుచేసి వారికి పలు ముఖ్య సూచనలు చేసి దుఆ అనంతరం హజ్ యాత్రకు బస్సులు ప్రారంబించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శులు ఎండి ఫతాఉల్లాహ్ , షేక్ ఫైజాన్ , టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, టిడిపి జిల్లా, నియోజకవర్గ నాయకులు మీర్జా ముజఫ్ఫర్ బేగ్, ముస్లిం మతపెద్దలు కలిసి హజ్ యాత్రకు బస్సులు ప్రారంభించారు.

కారు ఢీకొని 9 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - మైలవరం : కారు ఢీకొని 9 గొర్రెలు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మైల వరం మండలంలోని బొర్రా గూడెం వద్ద జరిగింది. వివరాల ప్రకారం కొత్త మంగా పురానికి చెందిన పటా పంచల గోపాలకృష్ణ, పటా పంచుల పిచ్చయ్యలు తమ గొర్రెలను మొక్కు నిమిత్తం బర్రగూడెంలోని తిరుపతమ్మ గుడివద్దకు వెళ్లి పూజా కార్యక్రమాలు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా చంద్రగూడెం గ్రామానికి చెందిన బులగాని రామకృష్ణ కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో 9 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 13 గొర్రెలకు కాళ్ల విరిగాయి. గోపాలకృష్ణ, పిచ్చయ్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.



మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ బస్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని కోదాడ రోడ్డు బేతస్త చర్చి పక్కన వెంకట సన్నీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఆదివారం ఒయాసిస్ ఫెర్టిలిటీ వారిచే మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ వారిచే సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత రిజిస్ట్రేషన్ కన్సల్టేషన్, ఫెర్టిలిటీ స్కానింగ్ మహిళలకు ఉచిత ఎఎం హెచ్, హిమోగ్లోబిన్, వైరల్ మార్కర్స్ పురుషులకు సీమెన్ అనాలిసిస్, వైరల్ మార్కర్స్ క్యాంపును స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. అనంతరం మెడికల్ క్యాంపును సందర్శించారు.



ఎండవేడిమికి జనం బెంబేలు



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



ప్రజాశక్తి-గన్నవరం: మే నెలలో పెరుగుతున్న ఉష్ణోగ్రత తీవ్రతకు జనాలు అల్లాడిపో తున్నారు. జాతీయ రహదారి నిప్పుల కొలిమిలా మారుతోంది. రోడ్డు మీదనడుస్తుంటే మంటలు పుట్టే సెగలు వస్తున్నాయి. దీంతో ప్రయాణికులు బేజారెత్తిపోతున్నారు. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రత 40 నుంచి 42 డిగ్రీలకు పెరిగింది. దీంతో వడ గాలుల తీవ్రత అధికంగా ఉంటుంది. వద్దులుబయటకు రావాలంటే భయ పడుతున్నారు. ఇప్పుడే ఇలాగుంటే రోహిణి కార్తెలో ఎలాగుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. 12 గంటలు అయ్యే సరికి ఎండ పెరిగి వడగాలులు వీస్తున్నాయి. జనాలు బయటకు రాకుండా ఇళ్లలోనే ఉంటున్నారు. వద్ధులు శీతల యంత్రాలు, ఫ్యాన్ల వద్దనే ఉండి పోతున్నారు. పనులున్నా సాయంత్రం 5 గంటల తర్వాతనే చేస్తున్నారు. నిత్యావసర వస్తువులు కావాలన్నా ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 6 గంటల తర్వాత బయలుదేరి దుకాణాలకు వెళ్తున్నారు. చెట్లు ఎక్కువ గా లేకపోవడంతో గాలి లేక ఉక్కపోతకు గురవుతున్నారు. మధ్యాహ్నం వేళలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇళ్లలో ఉండలేక అల్లాడిపోతున్నారు. గన్నవరం నుంచి వెళ్తున్న జాతీయ రహదారిపై మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత పెద్దగా జనాల సంచారం కనిపించడం లేదు. వాహనాలు పెద్దగా వెళ్లడం లేదు. రోడ్డు ప్రక్కన చెట్లు కింద వాహనాలు ఆపుకుని డ్రైవర్లు స్వేద తీరుతున్నారు. గన్న వరం-ఆగిరపల్లి రోడ్డు, పురుషోత్తపట్నం-ముస్తాబాదరోడ్డు, కేసరపల్లి-సావరగూడెం రోడ్డు, తెంపల్లి రోడ్లలో జనాల సంచారం కనిపించడం లేదు. గ్రామాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వద్ధులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో ఆరుబయట చెట్లు కింద కాసేపు స్వేద తీరుతున్నారు. ఇపుడు వడగాలుల దెబ్బకు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఆలోచిస్తున్నారు. మేనెలలో వేసవి మరింత ఎక్కువగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

చిరు వ్యాపారులకు ఇక్కట్లు

ఎండలు అధికంగా జనాలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బదులు పడుతున్నారు. పట్టణంలో రోడ్ల వెంట రోజువారీ వ్యాపారాలు చేసుకునేవారు 210 మంది ఉన్నారు. మామిడి కాయలు, కొబ్బరి బొండాలు, పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. ఉదయం 11 గంటల తర్వాత వడగాలుల పాలిట పడుతున్నారు. జనాలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు ఉండటం లేదని అంటున్నారు. జీవనోపాధికి తప్పని పరిస్థితుల్లో ఎండలోనే ఉంటున్నామని, రోజంతా కూర్చునా ఉపయోగం ఉండటం లేదని వాపోతున్నారు. అరటి పండ్ల వ్యాపారులు రాత్రి పది గంటలకు కూడా రోడ్ల వెంటనే ఉంటున్నారు. కాయల్ని ఏదో రకంగా అమ్ముకుని వెళ్లామనే ఆశతో వేచి ఉంటున్నట్లు చెబుతున్నారు. ఈ వేసవి ఎండల్లో వ్యాపారాలు సాగవని అంటున్నారు. కూరగాయలు ఎండిపోవడంతో జనాలు కొనుగోలు చేయడం లేదు. దీంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

శీతల పానీయాలకు డిమాండ్

ఎండల తీవ్రత వల్ల శీతల పానీయాలకు గిరాకీ ఏర్పడింది. కూల్ డ్రింక్స్ షాపులు యువకులతో కిటకిటలాడుతున్నారు. థమ్స్ అప్, మిరండా, ఫ్రూటీ వంటివి అధికంగా సేవిస్తున్నారు. ఐస్ క్రీమ్ పట్ల ఆసక్తి ఎక్కువగా చూపుతున్నారు. పిల్లలైతే వాటినే కొనుగోలు చేసి తినడం కనిపిస్తుంది. షాపు వద్ద కారు ఆగితే చాలు దాంట్లోని పిల్లలు దిగి లోపలకు వెళ్లి రూ.500 విలువైన ఐస్ క్రీములు కొంటున్నారు. అంటే ఎండల నుంచి బయట పడేందుకు ఎంత తపన పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కూల్డ్రింక్స్ విపరీతంగా తాగేస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్ షాపులు ఖాళీగా ఉండటం లేదు. గ్లాసు ఒకటి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొబ్బరి బొండాలకు మంచి డిమాండ్ ఉంటుంది. కాయ ఒకటి రూ.50 పలుకుతోంది. చిన్న బాటిల్ రూ.70 తీసుకుంటున్నారు. ఎండల తీవ్రతలు తట్టుకోలేక తరలు పెరిగిన జనం కొబ్బరి నీళ్ళు తాగి సేద తీరుతున్నారు.

వడగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ సునైనా

వేసవి కాలంలో మండుతున్న ఎండల పట్ల అప్రమత్తతో ఉండాలి. సాధ్యమైనంత వరకు ఉదయం పది గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత ముఖ్యమైన పనులు చూసుకోవాలి. అత్యవసరమైన పనులుంటేనే మధ్యాహ్నం బయటకు రావాలి. బయటకు వెళ్లే సమయంలో తెల్లటి దుస్తులు ధరించడంతో పాటు ముఖానికి గుడ్డ కట్టుకోవాలి. మార్గం మధ్యలో కొబ్బరినీళ తాగాలి. మంచినీరు అధికంగా తీసుకోవాలి. పండ్ల రసాలు, జ్యూస్లు అధికంగా తీసుకుం టే శరీరంలో శక్తి పెరుగుతోంది. వడదెబ్బ నుంచి బయటపడేందుకు వీలుంటుంది. ఎండల్లో తిరిగితే ఓఆర్ఎస్ పాకెట్ను లీటరు నీటిలో కలిపి తాగితే పోయిన శక్తి తిరిగి వస్తుంది. ఏదైనా ఆ రోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను కలుసుకోవాలి.

కొండలమ్మను దర్శించుకున్న సివిల్ జడ్జి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం గ్రామములోని శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి పి గాయత్రి వారి కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటం ప్రసాదాన్ని అర్చకులు, ఆలయ సిబ్బంది అందజేశారు. అలాగే ఆదివారం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి సుమారు 20వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. విచ్చేసిన యాత్రికులకు మజ్జిగ, చల్లని త్రాగునీరు శానిటేషన్ ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. దేవస్థానము వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి.వి సత్యనారాయణ, వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



రక్షణ గోడ నిర్మించరూ..!

ప్రజాశక్తి-మొవ్వ: మండలంలోని కూచిపూడి నుండి మొవ్వ వెళ్లే ప్రధాన రహదారిలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మురుగు కాల్వపై ఉన్న వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణగోడ సంవత్సరాలుగా లేకపోవడంతో ప్రయాణీకులు భయబ్రాంతులకు గురి అవుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. పైగా పెదపూడి జగనన్న కాలనీకి వెళ్లే దారి కూడా ఆవంతెన ప్రక్కనే దారి కావడంతో కాలనీవాసులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అక్కడే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారానికై అధికారులు సహకరించాలని ప్రయాణీకులు మరియు గ్రామస్తులు కోరుతున్నారు.



వైభవంగా తిరుకళ్యాణ వేడుకలు

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి తిరు కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత ఉత్సవమూర్తులను కళ్యాణ దంపతులుగా నూతన వస్త్రాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు ఊర్లో సాంప్రదాయ రీతిలో తిరుకళ్యాణవేడుకలు నిర్వహించారు. శ్రీ వైఖానస ఆగమరీత్యా నిర్వహించిన కళ్యాణ వేడుకలకు దేవస్థానం అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు సహకారంతో శ్రీ వైఖానస ఆగమ ప్రవర దీవి ఉదయ కుమార్ అయ్యంగార్ (పెనుమూడి) ఈ వేడుకలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు.



మోపిదేవిలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-మోపిదేవి: రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంగా మోపిదేవి యాత్రికుల విశేష ఆదరణతో దినదిన అభివృద్ధి చెందుతుంది. ఆదివారం యాత్రికులతో ఆలయ ప్రాంగణం అత్యంత రద్దీగా కనిపించింది. పది వేలకు పైగా యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ సంయుక్త కమిషనర్ దాసరి శ్రీరామ్ వరప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవా టికెట్ల ద్వారా ఆదివారం ఒక్కరోజే స్వామి ఆదాయం 10 లక్షల 33 వేల 719 రూపాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



నేడు మోపిదేవిలో మినీ మహానాడు

ప్రజాశక్తి-మోపిదేవి: అవనిగడ్డ నియోజకవర్గ మినీ మహానాడును విజయవంతం చేయాలని పలువురు టిడిపి నేతలు పేర్కొన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు సమావేశం19వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మోపిదేవిలో నిర్వహించనున్నారు. మోపిదేవిలో జాతీయ రహదారి పక్కన గల ఎస్ విహార్ హోటల్ ఎదురుగా గల పొలాల్లో కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను ఆదివారం పలువురు టిడిపి నేతలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, చందన రంగారావు, డోకిపర్తి బాల కోటేశ్వరరావు, నందిగం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గన్నవరం: భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బత్తుల శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం గన్నవరం మండలంలోని తెంపల్లిలో ఈ నెల 20వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కార్మికులను కలిసి ప్రచారం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డును నిర్వహిస్తుండగా, ఏపీలో భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టలేదన్నారు. భవన కార్మికుల సంక్షేమం కోసం సెస్ వసూలు చేస్తూ వేల కోట్ల రూపాయలు పోగేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు ఎస్కే మస్తాన్, మాధు రాము, రాజు పాల్గొన్నారు.



ముగిసిన అంకమ్మ తల్లి సంబరాలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని గరికిపర్రు లో వీరంకి వారి అంకమ్మ తల్లి సంబరాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వీరంకి వంశీకులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకునీ పూజలు నిర్వహించడంతోపాటు మొక్కుబడు లు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది .ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వెంకటేష్ గౌడ్, కమిటీ సభ్యులు అమ్మవారి జాతరను పర్యవేక్షించారు.

దొంగ భవానీలు హల్‌చల్

అన్నదానానికి డబ్బులివ్వాలంటూ బలవంతపు వసూళ్లు

ప్రజాశక్తి-గన్నవరం: భవానీ దుస్తులు ధరించి డబ్బులు ఇవ్వాలంటూ దందాలు చేస్తున్న దొంగ భవానీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం ముగ్గురు వ్యక్తులు భవాని దుస్తులు ధరించి హల్‌చల్ చేశారు. స్థానిక గన్నవరం శ్రీ నగర్ కాలనీకి కొందరు వ్యక్తులు కాషాయం మాలలు ధరించి రోడ్లపై కనిపించిన వారిని, ఇళ్లకు వెళ్లి తలుపులు కొట్టి అన్నదానం అంటూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వారికి నచ్చిన కనిపించిన ఇంటిలోకి ఒక గుంపుగా ప్రవేశించి అన్నదాన కార్యక్రమానికి డబ్బులు ఇవ్వాలంటూ భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. 500 నుంచి 5 వేల వరకు వసూలు చేశారు. బలవంతంగా ఇళ్లల్లోకి ప్రవేశించి డబ్బులు వసూలు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులపై పోలీస్ అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





చైతన్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతుపేటలో గల చైతన్య కళాశాలలో ఆదివారం 1997 - 1999 బ్యాచ్ చైతన్య కళాశాల ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చైతన్య కళాశాల చైర్మన్ దంపతులు అమరనేని రమేష్ జ్యోతిని పూర్వ విద్యార్థులు సన్మానిం చారు. పూర్వ విద్యార్థులందరు కాలేజీ రోజుల్లో జరిగిన మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తాము ఏ ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఏ ఉద్యోగం చేస్తున్నారు, ఎలా ఉంటున్నారు, కుటుంబాల వివరాలు ఒకరికొకరు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ తాటి రామకృష్ణ, క్లర్క్ రామకృష్ణ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం ఆవిర్భావంపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మైలవరం శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు జడ్‌పిహెచ్‌ఎస్ చిలుకూరి వారిగూడెం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పుల్లారెడ్డి విశ్వం ఆవిర్భావం, భూమి ఆవిర్భావం అనే అంశం గురించి అవగాహన కల్పించారు. భూగోళ శాస్త్రంలో అత్యంత వివాదాంశం భూమి పుట్టుక అన్నారు. దారి గురించి తెలుసుకోవాలంటే సౌర కుటుంబ ఆవిర్భావాన్ని గురించి తెలుసుకోవాలని, సౌర కుటుంబ ఆవిర్భావం గురించి తెలుసుకోవాలంటే విశ్వం ఆవిర్భావం గురించి తెలుసుకోవాలని విశ్వంలోని ఒక భాగమైన భూమి పుట్టుకకు విశ్వం పుట్టుకకు సంబంధం ఉందని క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



చింతా సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిపిఎం నేత చింతా సుబ్బారావు వర్ధంతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సిపిఎం నేత కామ్రేడ్ చింత సుబ్బారావు 14వ వర్ధంతి కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం సిపిఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర సిపిఎంకి ఉందన్నారు. అనేక భూ పోరాటాలు ఇళ్ల స్థలాలు పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ చింత సుబ్బారావు చురుకైన పాత్ర పోషించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘంగా అనేక పోరాటాలు నిర్వహించినట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ కమిటీ సభ్యులు ఎస్‌కె భాషా, చింత సుబ్బారావు కుమారుడు చింతా నాగరాజు, శ్రీ వీరాంజనేయ మినీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎన్.సురేష్ వర్మ, ఉపాధ్యక్షులు నాగరాజు, హెచ్‌పి గ్యాస్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు సూరిబాబు ఏలియా రాజు స్వామి శ్రీను పాల్గొన్నారు.

నృత్య కళార్చన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు గానూ కనకదుర్గమ్మ సన్నిధిలో నూతన రాజగోపురం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 6.30 నుండి కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. విజయవాడ నగరానికి చెందిన కళాక్షేత్ర డాన్స్ ఇన్‌స్టిట్యూట్ నృత్య విద్యార్థులు భక్తి శ్రద్ధలతో కనకదుర్గమ్మకు నృత్య కళార్చన నిర్వహించారు. గీత, మౌనిక ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులు తమ ప్రదర్శనలో భాగంగా పలు భక్తి కీర్తనలకు 10 మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన అనంతరం కళా బృందానికి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

20న మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సదస్సు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మే 20న ఆంధ్రప్రదేశ్ మినీ వ్యాన్ మోటార్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి మహేష్, ఆంధ్రప్రదేశ్ మినీ వ్యాన్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు ఎం.సురేష్ వర్మ, నాగరాజు రాము శ్రీనివాసరావు ప్రసాద్ తెలిపారుఉ. ఇబ్రహీంపట్నం - హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన శ్రీ వీరాంజనేయ మినీ ఆటో ట్రక్ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాక వద్ద నిర్వహిస్తున్నట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పనలో భాగంగా వెహికల్ కొనుగోలుకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలివ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రవాణా రంగంలో ట్రాఫిక్ నిబంధనల పేరుతో వేల రూపాయల పెనాల్టీలు వేస్తున్నారని, అరకొర తోలిన ఆ డబ్బులు ఫైన్స్ కట్టలేక రవాణా రంగంలో కార్మికులకు కుదేలవుతున్నారని, అపరాధ రుసుం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మోటార్ రవాణా రంగ కార్మికులకు అండగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న మహేష్

నేడు సుందరయ్య స్తూపం ప్రారంభం

ప్రజాశక్తి - వీరులపాడు : గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా భారీ స్థూపాన్ని వీరులపాడు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు సానుభూతిపరుల సహకారంతో ఏర్పాటు చేశారు. సోమవారం స్థూపాన్ని ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. వీరులపాడుతో సుందరయ్యకు విడదీయరాని బంధం ఉందని నాయకులు చెబుతున్నారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ పోరాటం ఫలితంగానే 13 ఎకరాల లంక భూమి పేదలకు దక్కింది. ఇప్పటికీ దళితులు ఉమ్మడిగానే సాగు చేసుకుంటున్నారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య స్తూపనిర్మాణాన్ని ప్రారంభించడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు ఇతర జిల్లా నాయకులు కార్యక్రమంలో పాల్గొని సుందరయ్య స్తూపం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామంలో అన్ని సెంటర్లు సిపిఎం ఎర్రజెండాలు తోరణాలు సిపిఎం జెండాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వట్టి కొండ పార్థసారథి కోడూరు పిచ్చేశ్వరరావు పల్లి కంటి బాబు సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, గడ్డం ప్రభాకర్, భవన నిర్మాణ కార్మికులు వినయ్, తుల యాకోబు ఇతర కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యాడ్ బ్లూ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : యర్రంశెట్టి వేణుగోపాల్ పగడాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాడ్ బ్లూ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీ డీజిల్ వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. నిర్వాహకులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కొండపల్లి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు, టి.ఎన్.టి.యు.సి.ఎన్.టి.ఆర్ జిల్లా కార్యదర్శి కూచిపూడి దిలీప్ కుమార్, పులి దాసు, కోయ వెంకట్రావు, ఉప్పుతల గోపాలరావు, పత్రి లేపాక్షి రావు, రావి ఫణి, కొత్తపల్లి ప్రకాష్, మాబు సుభాని, డాక్టర్ దాసు, స్థానిక పార్టీ నేతలు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



గ్రామాల్లో వ్యవసాయ కార్మికుల పర్యటన

ప్రజాశక్తి - వీరులపాడు : జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం జాతీయ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర చేపట్టారు. మండలంలోని వీరులపాడు, చౌటపల్లి, చట్టన్నవరం, అల్లూరు, పెద్దాపురం గ్రామాల్లో పర్యటనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం ప్రభాకరు, గూడెల్లి పుల్లయ్య పాపారావు, జయరాజు, కృష్ణ, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని కరపత్రాలు పంచారు.



కరపత్రాలు పంచుతున్న నాయకులు

ఎయిడ్స్ మృతులకు నివాళి

ప్రజాశక్తి - నందిగామ : ప్రపంచ ఎయిడ్స్ బాధితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నందిగామ గాంధీ సెంటర్లో ఎయిడ్స్ బాధితులకు నివాళులర్పించారు. ఎయిడ్స్ బారిన పడి మృతి చెందిన పలువురికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎయిడ్స్ నివారణ కమిటీ అధికారి డా. సుమన్ కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ నందిగామ కన్వీనర్ షీబా, సొసైటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

27న డిఎస్‌సిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రంలో ఈనెల 27న మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, సంఘాల ఆధ్వర్యంలో డిఎస్‌సిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు చిరుమామిళ్ల హనుమంతరావు తెలిపారు. ఈ సదస్సుకు విద్యావేత్త, మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలులో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అదే గ్రామానికి చెందిన రాయపూడి అనిల్ కుమార్, లక్ష్మీ తాయారు దంపతులు కుమార్తె అల్లుడు చంద్రిక, నిఖిల్ కుమార్ రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నగదును ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం ప్రసాదాలతో సత్కరించారు.



నందిగామలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ దృశ్యం

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత కలిగి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నందిగామ రూరల్ సిఐ చవాన్ కౌన్సెలింగ్ ఇచ్చారు. షీటర్లు ఇకపై ఎటువంటి వివాదాలకు పోకుండా మంచిగా ఉంటామని వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కంచికచర్ల టౌన్, మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని అటువంటి చర్యలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షీటర్లుగా నమోదైన వారు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. స్థానిక ఎస్ఐ బి.రాజు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒ ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్స్ సస్పెక్ట్ హోల్డర్స్‌కు ఎస్ఐ అభిమన్యు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. పోలీసులు పాల్గొన్నారు.



కంచికచర్లలో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పేకాట రాయళ్లు అరెస్టు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం మోగులూరు సమీపంలో పేకాట ఆడుతున్న 12 మంది జూదరులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 22 వేలు రూపాయలు నగదు స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

5న చలో విజయవాడను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో జరగబోయే ఆంధ్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కష్ణా జిల్లా తాలూకా కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు కషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రాము, టి. వర ప్రసాద్ లు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా తాలూకా కమిటీల అధ్యక్ష, కార్యదర్శుల ముఖ్య సమావేశం ఆదివారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సమావేశానికి ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు అవసరమైన వాహనాల ఏర్పాటుపై సమగ్ర ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా "చలో విజయవాడ" సమావేశానికి హాజరయ్యే ఉద్యోగులకు ఆన్ డ్యూటీ సర్టిఫికెట్ల మంజూరు ప్రక్రియను సులభతరం చేయడంపై దృష్టి సారించారు. ఈ విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. సంఘం యొక్క ఐక్యతను, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో దాని సంఘం యొక్క కషి వివరించారు. రాబోయే రోజుల్లో సంఘాన్ని మరింత బలపరిచేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్స్ కె.వి. లోకేష్, జి.శ్రీనివాస్, కె.కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ సి.హెచ్ పవన్‌కుమార్, సుమన్, ట్రెజరర్ సురేష్‌నాయక్, పి.చంద్రమోహన్, మచిలీపట్నం తాలూకా ప్రెసిడెంట్ పి.వి.పరమేశ్వర రావు, జి. నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ యం. సముద్రేశ్వరరావు, యం. ఏ. అబ్బాస్, కార్యదర్శి వి. బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన మాజీ సైనికులు

ప్రజాశక్తి-గుడివాడ: సమాజ ఉన్నతిలో విశ్రాంత సైనికులు భాగస్వామ్యులు కావాలని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వానికి కోరుతున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగహంలో పలువురు విశ్రాంత సైనికులు ఎమ్మెల్యే రామును కలిశారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే రాము పలు అంశాలపై మాట్లాడారు. తన తండ్రి వెంకటేశ్వరరావు ఆర్మీలో పని చేశారని, ఆర్మీ కుటుంబం నుండి వచ్చిన తనకు రిటైరైన తర్వాత వారి కష్టాలు తెలుసన్నారు. కఠిన శ్రమతో కూడిన శిక్షణ పొంది ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి, రిటైరైన సైనికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా, వారి సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.



ఎఎంసి చైర్మన్‌కు సత్కారం



ప్రజాశక్తి-అవనిగడ్డ: దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావును ఆదివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు సత్కరించారు. ఆ గ్రామానికి చెందిన మునిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు వెంకటేశ్వరరావును శాలువా పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి చంద్రశేఖర్, బందెల ఏసేపు, నలకుర్తి వెంకటేశ్వరరావు, మునిపల్లి వెంకటేశ్వరరావు, ఖైతేపల్లి సురేష్, కైతేపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

45 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక కోతి బొమ్మ సెంటర్లోని ప్రభావతి గార్డెన్స్‌లో గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డా.తిపిర్నేనేని లక్ష్మీ పెరుమాళ్లు, ప్రభావతి, చలసాని చౌదరి రాయన్‌ల జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజి చినఆవుటపల్లి వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది బాధితులు వైద్య సేవలను పొందారు. డా.దేవి శశిరామ్, డా.అభిషేక్, డా.తరుణ్ కుమార్ రెడ్డిలు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్స్ సి.సూర్యచంద్ర రావు, బి.శంకర రావు, ఎమ్.రమణమూర్తి, సభ్యులు ఆర్.రమేష్ బాబు, వి.డి.ఎస్.శంకర్, మారుతి కుమార్, స్వామి, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అప్పనవీడు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. హనుమాన్ జంక్షన్ అప్పనవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో 1992-93 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి సమావేశమయ్యారు. చానాళ్ల తరువాత కలిసిన వీరంతా ఒకరినొకరు పలకరించుకుంటూ, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ జోక్ లతో ఆటపాటలతో సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఉపాధ్యాయులు మారుబోయిన కోటేశ్వరరావు, డాక్టర్ లలితా కామేశ్వరి, రమణ, విద్యార్థులు తిమిరి రమేష్, తిరుపతిరావు, యుగంధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పెడనలోని ఆర్య వైశ్య సత్రంలో గోరు రాజు అధ్యక్షతన సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాల్గు గ్రేడ్లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కౌలురైతుల సమగ్ర చట్టం చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పంచల నరసింహారావు, సిహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** సిఐటియు ఆధ్వర్యంలో అవనిగడ్డ ఎన్జీవో హోమ్ వద్ద కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ముర్రాపు పోలినాయుడు మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాలన్నీ ఉద్యమించాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎమ్‌డి కరిముల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, అంగన్వాడి జిల్లా నాయకురాలు ఏ నాగమణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు



అవనిగడ్డలో...

విద్యుత్ షాక్‌తో సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ రూరల్ మండలం దొండపాడు సర్పంచ్ చోరగుడి సురేఖ (37) మరణించారు. ఆదివారం సాయంత్రం పంపు మోటార్ షాక్‌కు గురవ్వడంతో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. చిన్న వయస్సులోనే సర్పంచ్ మరణం బాధాకరమని నిత్యం ప్రజాసేవలో ఉండే సురేఖ మరణం పట్ల గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, వివిధ రంగాల ప్రముఖులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సురేఖకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



120 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-గుడివాడ: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాదెండ్ల వెంకట కష్ణవేణి జ్ఞాపకార్థం ఆదివారం ఎన్టీఆర్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఐ కేర్ హాస్పిటల్ విజయవాడ వైద్యులు డా. అజయ్, అప్తమాలజీ, శోభారాణి బృందం ఆధ్వర్యంలో 120 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 42 మందికి నాణ్యమైన కళ్ల జోళ్లు అందించారు. స్థానిక గౌరీశంకరాపురం విష్ట సూపర్ స్పెషాల్టీ డయోగ్నోస్టిక్ వారు ఉచితంగా బి. పి, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, దావులూరి సురేంద్ర బాబు, లింగం చిట్టిబాబు, కోన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాస్, కోశాధికారి తమ్మినేని రాంమోహన్, బొప్పన కుటుంబరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో కష్ణాజిల్లా మోడరన్ పెంటత్ లాన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటు అయింది. అధ్యక్షులుగా వెలగపూడి ఉజ్వల్, కార్యదర్శిగా మరీదు నరేంద్రబాబు, కోశాధికారిగా పలగాని సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కె కష్ణమోహన్, సంయుక్త కార్యదర్శిగా జి విజయకుమార్, కార్యవర్గ సభ్యులుగా కే టాన్యగిరి, ఎస్.కె గౌస్యానిని,సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం నాలుగు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ సమావేశానికి రాష్ట్ర మోడ్రన్ పెంటత్ లాన్ అసోసియేషన్ కార్యనిర్వాహకదర్శి కష్ణ హాజరయ్యారు. అలాగే అంతర్జాతీయ మోడరన్ పెంటత్ లాన్ శిక్షకులు సాంబశివరావు హాజరయ్యారు. కష్ణాజిల్లాలో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు జిల్లా సంఘం కషి చేయాలని ఈ సందర్భంగా కష్ణయ్య కోరారు. గ్రామీణ ప్రాంతంలోని ఉత్తమ క్రీడాకారులనే లక్ష్యంగా తీసుకొని జాతికి అందించేందుకు కృషి చేస్తామని అధ్యక్ష కార్యదర్శులు ఉజ్వల్, నరేంద్ర తెలిపారు.

సోమేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ: పర్చూరి సోమేశ్వరరావు జీవితం నేటి తరానికి స్ఫూర్తినిస్తుందని లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు హరినాథ్ తెలిపారు. పర్చూరి సోమేశ్వరరావు 25వ వర్ధంతిని అవనిగడ్డ సంత మార్కెట్ వద్ద ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలము నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావంతో ప్రారంభమైన ఆయన ప్రయాణం చివరి వరకు ఎర్రజెండా నీడన విప్ల ఉద్యమాన్ని అభిమానిస్తూ దానికి బాసటగా నిలిచి పని చేశారని చెప్పారు. దివిసీమలో సిపిఐ ఎంఎల్ రాజకీయ ప్రస్థానంలో ప్రజలను చైతన్యపరిచేందుకు బుచ్చి కోటయ్యతో కలిసి చేసిన కషి ప్రశంసనీయమన్నారు. హరినాథ్ తనయుడు న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఎర్రజెండాను సీనియర్ కమ్యూనిస్టు పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరించగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా రైతు సంఘం నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ పూలదండలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అందే శ్రీరామకృష్ణమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ తుంగల కోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లేబరేషన్ నాయకులు బండారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-పామర్రు: శాఖా గ్రంథాలయం జమీగొల్వేపల్లిలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ఆదివారం విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు చేత సామూహిక పఠనా కార్యక్రమం (మాస్ రీడింగ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు వి. నాగ సురేష్ మాట్లాడుతూ జ్ఞాన సముపార్జనకు సరైన మార్గం గ్రంథపఠనం అని, విద్యార్థులు చిన్ననాటి నుండే గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకొని ప్రతిరోజు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి-పమిడిముక్కల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆశ వర్కర్ల కుటుంబాలకు మేలు జరిగే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, వారికి రావలసిన ఆర్థిక సహాయం అందజేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం మండలంలోని తాడంకి, గోపువానిపాలెం, మంటాడ గ్రామాల్లోని ఆశ వర్కర్ల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గూడూరు: క్రీడలు శారీరక దఢత్వానికి మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు మండలంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తుందన్నారు. అనంతరం గూడూరు మెయిన్ టీం కు జనసేన పార్టీ తరపున మొదటి బహుమతి 20 వేలు, వాడవల్లి బ్రదర్స్ తరపున కంచా కూడూరు టీంకు రెండో బహుమతి 15 వేల రూపాయలు, మల్లవోలు టీంకు పులివర్తి బ్రదర్స్ తరపున మూడో బహుమతి 10 వేల రూపాయలు, కోపనారడపాలెం టీం కు దాసరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం దాసరి హనుమ నాలుగో బహుమతి 5 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ పోతన స్వామి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాసరి ఉమా సాయిరాం, పోతన రామోజీ, ఎన్ ఏ బేగ్, పుప్పాల సురేష్, బాసం శెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గారావు, టోర్నమెంట్ నిర్వాహకులు అప్పికట్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ కృష్ణప్రసాద్

తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-గూడూరు: ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా గూడూరులో ఆదివారం గ్రామస్తులు నిర్వహించిన తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ర్యాలీని ప్రాంరంభించారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ పోతనస్వామి, దాసరి ఉమా సాయిరాం, పోతన రామోజీ, పుప్పాల సురేష్, ఎన్ ఎ బేగ్, బాసం శెట్టి విజయ్ పాల్గొన్నారు.

నేడు పేటలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 19వ తేదీ సోమవారం నందిగామ డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం జగ్గయ్యపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) జిల్లాస్థాయి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని నందిగామ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సారి నందిగామ డివిజన్ ప్రజల సౌకర్యార్థం సమీపంలోనే ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, జగ్గయ్యపేట 'బి' కన్వెన్షన్ సెంటర్లో ఉదయం 10 గంటల నుండి అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. నందిగామ డివిజన్‌తో పాటు మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా అర్జీలు సమర్పించవచ్చని, విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో కూడా అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎప్పటిలానే డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.



ముగిసిన ఎడ్ల పందేల పోటీలు

ప్రజాశక్తి - నందిగామ : లింగాలపాడు గ్రామంలో శనివారం రాత్రి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎడ్ల పందేల పోటీలను తిలకించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పశు ప్రదర్శన బండ లాగుడు పోటీలు గత ఐదు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ముగిసిన పశు బల ప్రదర్శన (బండ లాగుడు) పోటీల్లోని విజేతలకు దేవినేని ఉమా పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. మండల పరిధిలోనే లింగాలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరుణాల మహోత్సవాలు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి టిడిపి నాయకులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్, ఆలయ అధికారులు దేవినేని ఉమాను శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎడ్ల పందాలను తిలకించిన సామినేని

నందిగామ మండలం లింగాలపాడులో శనివారం రాత్రి ఎడ్ల పందాలను మాజీ ప్రభుత్వ విప్, జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను తిలకించారు. శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి తిరునాళ్ల పురస్కరించుకొని గ్రామంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పశు ప్రదర్శన బండ్ల లాగుడు పోటీలు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు సామనేని ఉదయ భాను ప్రారంభించారు.

గ్రంథాలయంలో మ్యూజియం డే

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం మ్యూజియం డే నిర్వహించారు. ఈ సందర్భంగా కంచికచర్ల హైస్కూల్ తెలుగు మాస్టర్ ఎస్‌కె ఇస్మాయిల్ మ్యూజియం ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు యాపిల్ బొమ్మను గీసి చూపించారు. క్రాఫ్ట్ మాస్టర్ ఎం.కనకారావు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. విద్యార్థులు కొద్దిసేపు పుస్తకాలు చదువుకొని, కొన్ని పాటలకు డ్యాన్స్ చేశారు. గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

అండర్ -15 బాల బాలికల చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణా జిల్లా అండర్ - 15 బాల, బాలికల చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో 28 మంది, బాలికల విభాగంలో 15 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. పోటీలు ఐదు రౌండ్లుగా నిర్వహించినట్లు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్.ఎం.ఫణి కుమార్ తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజ్ఞాన భారతి హైస్కూల్ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.రావు, కరూర్ వైశ్య బ్యాంక్ మేనేజర్ కె.శ్రీనివాస్, ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పి.రేణుక, డిప్యూటీ తహశీల్దార్ నాగ జ్యోతి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ లో మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన వారు జూలైలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ -15 చెస్ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు తరపున పాల్గొంటారని ఫణి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతల వివరాలు తెలిపారు.

విజేతల వివరాలు....

బాలుర విభాగంలో యు.హర్షిత్ సాయి, ఈ.లలిత్ కౌశిక్, వి. మోనిష, డి.భాను ప్రకాశ్ మొదటి నాలుగు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ఎం.గీతా మాధురి, ఎం.నాగ శోభా శ్రీ, ఆర్. హర్షిత్ గౌడ్, జె.లాస్య వెంకట ప్రియ ఎంపికయ్యారు.



రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 16 నుంచి 18 వరకు చిత్తూరు డిఎస్ఎ స్టేడియంలో జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా రెజ్లర్లు పతకాలు సాధించారని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇన్చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 16 జిల్లాలు పాల్గొన్న ఈ పోటీల్లో బి.నిహారిక బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. బి.కుమార్, శరణ్య,మోహన్, వంశీ రజత పతకాలు, శివనాగ లక్ష్మీ, అభిషేక్, హేమంత్ సాయి, శైలజ కాంస్య పతకాలు సాధించారు. రెజ్లింగ్‌లో జిల్లా రెజ్లర్లు ఈ ఏడాది అన్ని విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారని, నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్‌కెపివివిహిందూ హై స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించారని



తెలిపారు. జిల్లా జట్లకు జి.భార్గవ సాయి గణేష్ కోచ్‌గా, జి.బిళ్ల హరి సాయి సహాయక కోచ్‌గా వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్ తెలిపారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్టేషన్లలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గొనకూడదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిఏత వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజ్ఞానం, సాంస్కృతిక రంగాల బలోపేతానికి కృషి

కృష్ణ, చిన్నారావు

ప్రజాశక్తి - విజయవాడ : మానుకొండ సుబ్బారావు గ్రంథాలయం, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక కళావేదిక కార్యకలాపాలను రానున్న కాలంలో విస్తరించి, అటు విజ్ఞానాన్ని, ఇటు సాంస్కృతిక కార్యక్రమాలను అభివృద్ధి చేసి, ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దాతలు ముందుకు రావాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పుప్పాల కృష్ణ, గ్రంథాలయ కమిటీ కన్వీనర్ బత్తుల చిన్నారావు పిలుపునిచ్చారు. మానుకొండ సుబ్బారావు గ్రంథాలయం, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక కళావేదిక ప్రథమ వార్షికోత్సం కార్యక్రమం సంబంధిత బిల్డింగ్‌లో కృష్ణలంక 22వ డివిజన్‌లో ఆదివారం జరిగింది. దీనికి డివైఎఫ్ఐ పూర్వ నాయకులు వాజా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానుద్దేశించి కృష్ణ, చిన్నారావు మాట్లాడుతూ ఈ సమాజ మార్పుకోసం, కష్టజీవుల హక్కుల కోసం జీవితాన్ని ధారపోసిన మానుకొండ సుబ్బారావు పేరిట కృష్ణలంక 22వ డివిజన్‌లో గ్రంథాలయాన్ని, సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తుర్లపాటి రామయ్య సాంస్కృతిక కళావేదికను పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేసుకొని ఏడాది అయిందని అన్నారు. ఈ ఏడాది కాలంలో గ్రంథాలయంతో పాటు కళావేదిక ఆయా తరగతి ప్రజలకు, యువతీ, యువకులు, పిల్లలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారికి వివిధ రూపాల్లో



మాట్లాడుతున్న పుప్పాల కృష్ణ

ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. విజ్ఞాన బాండాగారమైన గ్రంథాలయం విస్తరించడానికి విలువైన వివిధ రకాల పుస్తకాలను అందించడానికి అభ్యుదయ వాదులు, ఆయా రంగాల్లోని ప్రముఖులు, మేధావులు ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే పలు రకాల పుస్తకాలు, పేపర్లు అందుబాటులో ఉండటం నిత్యం పాఠకులు గ్రంథాలయానికి విచ్చేసి చదువుకోవడం జరుగుతుందన్నారు. యువతకు జీవనోపాధిగా ఉండటానికి వీలుగా రానున్న కాలంలో ఈ బిల్డింగ్‌లోనే కుట్టు మిషన్లను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పించి, పలువురికి ఉపయోగకరంగా ఉండటానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు టి.తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రోడ్లు జలమయం

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి : సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆదివారం అకస్మాత్తుగా వచ్చిన వర్షానికి పశ్చిమ నగరంలో సితార సెంటర్ నుండి కబేళా సెంటర్ వరకు గొల్లపాలెం గట్టు మహంతిపురం, వించిపేట నైజాం గేటు, జండా చెట్టు ఏరియా తదితర ప్రాంతాలు ఆదివారం జలమయం అయ్యాయి. 20 నిమిషాల పాటు వచ్చిన ఈ వర్షానికి ఈ పరిస్థితి రాబోయే వర్షాకాలం తీవ్రమైన వర్షాలకు మరింత ప్రమాదం ప్రజలు ఎదుర్కోబోతున్నారు. ప్రణాళికలు లేని డ్రైనేజీ వ్యవస్థ, సక్రమ నిర్వహణ జరక్క బుడమేరు ఆధునీకరణ చేయక నగర ప్రజలకు ఈ దుస్థితి దాపరిచిందని అన్నారు. ఇప్పటికైనా వర్షపు నీటి ముంపు నివారణ చర్యలను స్ట్రాంగ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన 289 కోట్ల రూపాయల నిధులు కాబట్టి నగర ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నగర పాలకులకు విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాల రిటైనింగ్ వాల్ నిర్మాణాలు వేసవికాలంలో పూర్తి చేసేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో కె.లక్ష్మణరావు, మీరా, రాజేష్ పాల్గొన్నారు.

అకాల వర్షం : రైతులు ఉరుకులు పరుగులు

కంచికచర్ల : కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటలు దాటాక ఈదురు గాలులు వీశాయి. అంతలోనే భారీ వర్షం కురిసింది. కంచికచర్ల మండలంలోని కీసర, గండేపల్లి, పెండ్యాల, ఏటి ఒడ్డున గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రబీలో సాగుచేసిన ధాన్యం తడవకుండా రైతులు ఉరుకులు పరుగులు పెడుతూ పట్టాలు కప్పేందుకు నానా తంటాలు పడ్డారు. గ్రామాల్లో రోడ్ల వెంట నీరు పారింది.



వన్‌టౌన్‌లో కొద్దిపాటి వర్షానికే జలమయమైన రోడ్లు పరిస్థితిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు, తదితరులు

